క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి గురుపూజోత్సవం



పట్నంబజార్: మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లాడ్జిసెంటర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు నాగేశ్వరచారి, కడియాల సుబ్బారావు, సున్నం మల్లికార్జునరావు, వెంకటచారి, గురుబ్రహ్మాచారి, ఈశ్వరాచారి పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు అర్జీలు అందించవచ్చని కోరారు. గ్రామ సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

వైభవంగా నిమిషాంబాదేవి జయంతి

పాత గుంటూరు: వల్లూరువారితోటలోని వీర ప్రతాప ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్య క్షత్రియ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిమిషాంబాదేవి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంఘ ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సువాసినులతో అష్టోత్తర శత నామావళి, కుంకుమ పూజ, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వీరభద్ర నాగరాజు, ఉపాధ్యక్షులు వై.నాగేశ్వరరావు వర్మ, కార్యదర్శి నాగ సురేష్ పాల్గొన్నారు.

అలరించిన స్వరమాధురి సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరమాధురి సంస్థ వ్యవస్థాపకుడు శెట్టి థామస్ ఆధ్వర్యంలో ఆదివారం అలనాటి ఆణిముత్యాలు పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ముఖ్య అతిథులుగా మిరియాల గోపీకుమార్, ప్రసాదరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. గాయకులు మేకల పురుషోత్తమ్ ప్రసాద్, థామస్, చీకటి రవికాంత్, డాక్టర్. సి.వి.ఎస్.రామకృష్ణ, శ్రీనివాసరావు, సౌజన్య, ప్రణతి, చింతా రజని పాటలను ఆలపించారు.

ప్రధాని మన్‌కీ బాత్‌ను తిలకించిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ వందో ఎపిసోడ్‌ను ఆదివారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థులు తిలకించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్, భారీ డిస్‌ప్లేలో వీక్షించారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నిర్వహిస్తున్న మన్ కీ బాత్ ద్వారా మన దేశ ఔన్నత్యానికి, ఎదుగుదలకు కృషి చేస్తున్న ఎంతోమంది విశిష్ట వ్యక్తుల గురించి తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ, స్ఫూర్తి నింపవచ్చన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

నేడు నృసింహుని దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి: నగరంలోని మన్నెం వారి వీధిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో నూతనంగా నిర్మించతలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శంకుస్థాపన చేయనున్నట్లు దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరిధర్‌రావు



పుష్పయాగంలో పాల్గొన్న మహిళలు

పాత గుంటూరు: ఆర్ అగ్రహారంలోనికన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆదివారం అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, సేవాదళ్, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు, లక్ష్మీ గణపతి హోమం, చండీహోమం, వాస్తుహోమం, నవగ్రహ హోమం, క్షీరాభిషేకం, 108 కలశలతో గ్రామోత్సవం, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణతో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్‌రావు పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని సంఘాల అధ్యక్షులు ఆతుకూరి నగేష్‌కుమార్, అమరా శ్రీనివాసరావు, మొగిలి సతీష్ కుమార్, యిమ్మడిశెట్టి ప్రమీలారాణి, కార్యదర్శులు యేచూరి వెంకయ్య, జి. మహేష్, రంగా మురళీకృష్ణ, అమరా షర్మిల, కోశాధికారులు రవి కుమార్, కె.నాగేంద్ర, శ్రీకాంత్, నాగ పరిపూర్ణ పర్యవేక్షించారు.

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆలయ అధ్యక్షులు కొత్తూరి వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి జన్మదినం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, వేదసూక్త, ఉపనిషత పారాయణ, గణపతి పూజ, 102 బిందెల నదీ జలాలతో అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అనంతరం సామూహిక కుంకుమార్చన, మహానైవేద్యం, మంత్రపుష్పం, మంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం లక్ష మల్లెలతో పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని కార్యదర్శి తెల్లాకుల లక్ష్మీ గురుప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆంగ్ల భాషా నైపుణ్యం కీలకం



విరాళాన్ని అందజేస్తున్న నాగేశ్వరరావు, డీఎస్పీ గోలి లక్ష్మయ్య తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలో రాణించేందుకు ఆంగ్ల భాషా నైపుణ్యాలు ఎంతో కీలకమని మానవతా వాలంటరీ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట రెండో లైనులోని అపెక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 27 ఏళ్ల క్రితం జిల్లాలో ఆంగ్ల భాష నైపుణ్యాల బోధన కోసం శిక్షణ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా 30 వేల మందికి పైగా విద్యార్థులను దేశ, విదేశాలలో వివిధ రంగాల్లో స్థిరపడేలా చేయడంలో అపెక్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. బాపట్ల క్రైమ్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలు అందిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థకు డీఎస్ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా అపెక్స్ సంస్థ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు రూ.50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జ్ఞాపికలతో పాటు విలువైన వ్యక్తిత్వ వికాస పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ రామానుజుల రెడ్డి, ఏఎన్ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పావులూరి శ్రీనివాసరావు, గుంటూరు మానవతా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, ప్రముఖ ఆడిటర్ దామచర్ల శ్రీనివాసరావు, మద్దినేని సుధాకర్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థిక వెసులుబాటు



మాట్లాడుతున్న జయచంద్

గుంటూరు ఎడ్యుకేషన్: పుట్టగొడుగుల పెంపకం ద్వారా యువ పారిశ్రామికవేత్తలుగా రాణించవచ్చని తనుశ్రీ మష్రూమ్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు టి.జయచంద్ పేర్కొన్నారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మైక్రో బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మష్రూమ్స్ ఫలసాయ పెంపకంపై విద్యార్థినులకు అవగాహనతో పాటు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్ మాట్లాడుతూ వేడి వాతావరణానికి తట్టుకుంటూ రూ.500 పెట్టుబడితో ఒక కేజీ విత్తనాలను కొనుగోలు చేసి ఎనిమిది కేజీల పుట్టగొడుగుల ఫల సాయం ద్వారా రూ.రెండు వేల ఆదాయం పొందవచ్చని చెప్పారు. పుట్టగొడుగులలను ఆహారంలో భాగం చేయడం ద్వారా శాఖాహారులకు మాంసాహారులతో సమానమైన ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్స్, బీవన్, టు, సీ, డీ పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. పుట్టగొడుగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు,, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ వంటి భయానక వ్యాధుల నుంచి రక్షించబడవచ్చునని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, మైక్రో బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతులు ప్రవీణ కుమారి, జయశ్రీ, అధ్యాపకులు డాక్టర్ సుచరిత, అరుణ, మాధురి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేత



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న గోవిందురెడ్డి

తాడేపల్లిరూరల్: యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే క్రికెట్ పోటీల ముఖ్య ఉద్దేశమని కళ్లం ఫౌండేషన్ నిర్వాహకులు కళ్లం గోవిందరెడ్డి అన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 64 టీమ్‌లు పాల్గొనగా, రెండో రౌండ్‌కు 32 టీమ్‌లు చేరుకోవడంతో రెండో రౌండ్ మ్యాచ్‌లు ఆదివారం మొదలయ్యాయి. మొదటి మ్యాచ్‌లో అజిత్‌టీమ్, శ్రీ ఇన్ఫోటెక్ టీమ్ పోటీ పడగా మొదట బ్యాటింగ్ చేసిన అజిత్ టీమ్ 16 ఓవర్లలో 114 పరుగులు చేసి ఆలౌట్ కాగా, శ్రీ ఇన్ఫోటెక్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. దీంతో అజిత్ టీమ్ 7 పరుగులతో విజయం సాధించింది. అనంతరం 175 సీసీ, ఎంఎస్‌కే సీసీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 175 సీసీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎంఎస్‌కే సీసీ జట్టు 82 పరుగులకు ఆలౌట్ కావడంతో 175 సీసీ జట్టును విజయం వరించింది. ఈ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అజయ్‌కు టోర్నీ నిర్వాహకులు కళ్ళం గోవిందరెడ్డి చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఆ తరువాత జరిగిన మూడో మ్యాచ్‌లో ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ, క్రేజీ క్రికెటర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా మొదటగా బ్యాటింగ్ చేసిన ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ జట్టు 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేయగా, క్రేజీ క్రికెటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. దీంతో ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గరుగు సుబ్బారెడ్డి అందజేశారని అన్నారు. యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు చాలా దోహదపడతాయని, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్, క్రికెట్ పోటీలు మాత్రమే కాకుండా ఇంకా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన తేజో

మంగళగిరి: జేఈఈ మెయిన్స్‌లో మంగళగిరి విద్యార్థి 99.43 పర్సంటైల్ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. మంగళగిరికి చెందిన మాజేటి పార్థసారథి –పార్వతి దంపతుల కుమారుడు తేజో రామ విఘ్నేశ్వర్ శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 99.43 పర్సంటైల్ మార్కులు సాధించాడు.

రైల్వే ట్రాక్‌పై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. వడ్డేశ్వరానికి చెందిన మర్రి సూరిబాబు, మహాలక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడు కిరణ్‌కుమార్(24) ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. విజయవాడలో చిన్న ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రయాణం కావాల్సి ఉంది.

శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన కిరణ్‌కుమార్ చెన్నై విజయవాడ రైల్వే ట్రాక్‌పై తలపెట్టి పడుకోవడంతో రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్‌కుమార్ మొండెం, తల వేరువేరు అయ్యాయి. రైల్వే సిబ్బంది కిరణ్‌జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులంపేరుతో దూషణ కేసు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో ఓ వ్యక్తి భార్యను దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ కాలనీ గాంధీనగర్‌కు చెందిన షేక్ ఖాజావలి జనవరిలో పి.అచ్యుత అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అనంతరం తల్లిదండ్రులు వద్దే కాపురం పెట్టాడు. అయితే ఖాజావలి అతడి కుటుంబ సభ్యులు అచ్యుతను తరచు కులంపేరుతో దూషించి కట్నం తీసుకురావాలని వేధించారు. అచ్యుత తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఉరి వేసుకుని

గుంటూరు ఈస్ట్: మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రయ్యనగర్‌లో నివాసించే జొన్నలగడ్డ శ్యామ్ అతడి భార్య విజయ తరచూ గొడవ పడుతుంటారు. శ్యామ్ మద్యం తాగి భార్యను తరచు వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తలలేక విజయ(28) ఆదివారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. వీరికి ఇద్దరు పిల్లలు. విజయ తండ్రి గజ్జల చిన్నా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వాచ్‌మెన్ మృతి

గుంటూరు ఈస్ట్: ఆలయంలో వాచ్‌మెన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలనగర్‌లోని ఓ ఆలయంలో వి.బాలునాయక్ (52) వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. అనారోగ్యంతో ఆదివారం ఆలయం ప్రాంగణంలోని తన గదిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. అతడి కుమారుడు అంజిబాబునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మజ్జిగ పంపిణీ

మంగళగిరి: నగర పరిధి యర్రబాలెం శివాలయం సెంటర్‌లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో ఆదివారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులు, వాహనదారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమవరపు వెంకట్రావు, లేళ్ల నరసింహారావు, మక్కే కిరణ్, గంధం సురేష్ పాల్గొన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయండి

పట్నంబజార్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్‌యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బృందావనం గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో ఉదయం 9.30గంటలకు జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ ఉంటుందని చెప్పారు. కార్మిక శక్తి ఎనలేనిదని కొనియాడారు. అందుకే వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పేరులోనే కార్మికులకు గుర్తింపు కల్పించారన్నారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సుందర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతల గనిక ఝాన్సీ, బిక్కు నాయక్ పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్ నూతన డిపాజిట్ పథకం ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): రెప్కో బ్యాంక్(భారత ప్రభుత్వ సంస్థ) నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎ.మహలక్ష్మీ బాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కు 8.05 శాతం వడ్డీ, అలాగే సాధారణ సిటిజన్స్‌కు 7.55 శాతం వరకు వడ్డీ అందజేయనున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాలపై అత్యధికంగా గ్రాముకు రూ.4,450 చొప్పున అతి తక్కువ వడ్డీకి రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు బ్రాడీపేటలోని తమ శాఖను సంప్రదించాలని కోరారు. బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



పూజల్లో పాల్గొన్న మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతులు

పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఆదివారం విరించి ఫ్యాషన్స్ మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతుల నిర్వహణలో స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పుజారి పరుచూరి మాధవస్వామి, పరాశరం కృష్ణ కిషోర్ బృందం ఆధ్వర్యంలో విశేషంగా పాల్గొన్న భక్తుల గోవింద నామాలతో వివిధ రకాల పుష్పాలు, తులసి, అనేక సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పుష్పయాగం నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు విశేష తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం మేళతాళాలతో, కోలాటాలతో శ్రీ పద్మావతి, గోదా సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. గీత జ్ఞానయజ్ఞనిధి శ్రీమాన్ నారాయణం ప్రసాదాచార్యస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, మెట్టు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమంలో మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీ అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి బి.విల్సన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కార్మిక, కర్షక, జనావళి శుభం కోసం నిరంతరం కవితలు రాసిన శ్రీశ్రీ ముద్ర తెలుగు సాహిత్యంలో చెరగనిదని అన్నారు. కార్యక్రమంలో కవులు ఎస్.ఎం.సుభాని, కళాకారులు బాబూరావు, నామతోటి ఉదయ శంకర్, నల్లపు నీలాంబరం, పాత్రికేయులు బండారు సురేష్ బాబు, బత్తుల కోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, ఝాన్సీ పాల్గొన్నారు.

మానవతా విలువల జాగృతికి కృషి



మాట్లాడుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో అడుగంటుతున్న మానవతా విలువలను జాగృతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వందలాది మంది యువకులతో రక్తదాన, వైద్య శిబిరాల నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం చేయిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంస్థ కేంద్ర కమిటీ డైరెక్టర్ డాక్టర్ రామాంజుల రెడ్డి, గుంటూరు జిల్లా చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్షుడు ఎస్.రామారావు, కార్యదర్శి వై.రమణబాబు పాల్గొన్నారు.

కనకపుట్టమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కన్నబాబు దంపతులు



కనకపుట్టమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కన్నబాబు దంపతులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులోని కనకపుట్టమ్మ తల్లి దేవస్థానంలో మాజీ వ్యవసాయ శాఖమంత్రి కన్నబాబు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకరరావు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు దంపతులకు ఘన స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాల అనంతరం వేద ఆశీర్వచనం చేసి దంపతులను సత్కరించారు. తదుపరి వైఎస్సార్ సీపీ పెదకొండూరు పార్టీ కన్వీనర్ బర్మా అర్జునరావు, నాయకులు కొండూరు శేషులు కన్నబాబుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మలబంటి శ్రీరామమూర్తి, బెల్లకొండ శ్రీనివాసరావు, వి. శంకర్, గోపి, అశోక్, సాయి, రవి, బుల్లబ్బాయి, సుబ్బారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాల భైరవ హోమం



కాల భైరవ హోమంలో పాల్గొన్న భక్తులు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం ఆవరణలో శనివారం రాత్రి కాల భైరవ హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. యర్రబాలెంకు చెందిన నాయుడు శ్రీనివాసరావు– నాగేశ్వరమ్మ, అనిల్ కుమార్, శిరీష, ధర్మతేజ, భార్గవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాల భైరవ హోమ పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు పూర్ణసాయి, రామకృష్ణ, శ్రీనివాస్ కాల భైరవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.